క్లుప్తంగా

నేడు డబుల్ రోడ్డు పనులకు బాలినేని శంకుస్థాపన

కొత్తపట్నం: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం రూ.2.75 కోట్లతో చేపట్టనున్న డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం హైదరాబాద్ నుంచి సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు చేరుకుంటారు. స్థానిక మార్కెట్ యాడ్ నుంచి కె.పల్లెపాలెం బీచ్ వరకు రూ.2.75 కోట్లతో మంజూరైన రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు.

వక్తృత్వ పోటీలో కొత్తపట్నం విద్యార్థినికి బహుమతి



కౌసల్యను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు

కొత్తపట్నం: జిల్లా స్థాయిలో జరిగిన ఖాదీ మహోత్సవ పోటీలు ఒంగోలు సెయింట్ థెరీసా హైస్కూల్‌లో ఈ నెల 14 నెహ్రూ జయింతి సందర్భంగా పోటీలు నిర్వహించారు. వ్యాసరచన డిబేట్ పోటీలు సమగ్ర శిక్ష, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించారు. వక్తృత్వ పోటీలో బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎం.కౌసల్య మొదటి బహుమతి సాధించింది. త్వరలో జగబోవు రాష్ట్ర స్థాయి పాల్గొంటారని ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.శ్రీదేవి తెలిపారు. మంగళవారం శ్రీదేవి, స్టాఫ్ సెక్రటరీ కె.హరిబాబు, పాఠశాల సిబ్బంది జి.ఉమామహేశ్వరరావు, పర్రె వెంకట్రావు, షేక్ జిలాని భాష, చెక్క కోటేశ్వరరావు, తదితర ఉపాధ్యాయులు కౌసల్యను అభినందించారు.

'ఖాదీ మహోత్సవం'లో విద్యార్థిని ప్రతిభ



అభినందనలు అందుకుంటున్న చాందిని

చీమకుర్తి: స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని జిల్లాస్థాయి ఖాదీ మహోత్సవ్ వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా అధికారులు బహూకరించిన ఖాదీ టవల్‌ను హెచ్‌ఎం జి.వీరాస్వామి మంగళవారం చాందిని మెడలో వేసి అభినందించారు. ఉపాధ్యాయులు స్వరూపారాణి, రాధామాధవి, వసంత భవానీ, అంజలి, రవి, జయప్రద, లక్ష్మి, ముంతాజ్ అభినందించారు. అనంతరం బాలల దినోత్సవ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి స్వీట్లు పంచిపెట్టారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ



ల్యాప్‌ట్యాప్, నోట్‌పుస్తకాలను అందిస్తున్న డాక్టర్ బి.జవహర్, చలువాది బదరీనారాయణ

చీమకుర్తి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముప్వవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. మంగళవారం చీమకుర్తిలోని డాక్టర్ బి.జవహర్ ఆస్పత్రి ప్రాంగణంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బి.జవహర్, గెలాక్సీ గ్రానైట్ యజమాని చలువాది బదరీనారాయణ చేతుల మీదుగా అందించారు. పీజీ చదువుతున్న పేద విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందించారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు చలువాది రమేష్, నూనె హేమసుందర్, స్థానికులు పాల్గొన్నారు.

నేడు ఆలూరి హాస్పిటల్‌లో మెగా వైద్య శిబిరం

ఒంగోలు టౌన్: నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గల ఆలూరి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చైర్మన్ డాక్టర్ ఎ.వి. సుందరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూరో సర్జరీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఈఎన్‌టీ ఆప్తమాలజీ పరీక్షలతోపాటుగా ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, ఈసీజీ, అవసరమైన వారికి ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లు కూడా ఉచితంగా చేయనున్నట్లు వివరించారు. డాక్టర్ మన్నం శింగయ్య మెమోరియల్ ట్రస్ట్ సహాయ సహకారాలతో హెల్త్ కార్డు రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్డు ద్వారా ఉచిత ఓపీ, లాబరేటరీ పరీక్షల్లో 20 శాతం, హాస్పిటల్‌లో అడ్మిట్ అయిన వారికి 15 శాతం రాయితీ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు తక్కువ ధరకే జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లు చేయనున్నామని తెలిపారు. ఏపీఎస్‌ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.సుధాకర్ పాల్గొంటారని తెలిపారు.

అనారోగ్యంతో యువకుడు మృతి

ఒంగోలు టౌన్: అనారోగ్యంతో ఓయువకుడి మృతి చెందాడు. ఈఘటన మంగళవారం ఒంగోలు రిమ్స్‌లో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. కొత్తపట్నం గ్రామానికి చెందిన పోలూరు నాంచారులు (30) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. ఈక్రమంలో రెండు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తల్లి నాంచారులను చికిత్స కోసం మంగళవారం ఉదయం రిమ్స్‌కు తీసుకువచ్చింది. సాయింత్రం వైద్యులు చికిత్స అందించగా కొద్దిసేపటికే మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే నా కుమారుడు మృతి చెందాడని తల్లి భోరున విలపించింది.

క్రమశిక్షణ, నైతిక విలువలు ముఖ్యం



ఒంగోలు: బహుమతి అందుకుంటున్న విద్యార్థి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు



ఉప్పుగుండూరులో నివాళులర్పిస్తున్న పీర్ అహ్మద్

ఒంగోలు: క్రమశిక్షణతో పాటు నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులు అభ్యసించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు పేర్కొన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్య అనేది బాలల హక్కుగా పేర్కొన్నారు. డ్రాప్ అవుట్స్ కనిపెట్టి ఉపాధ్యాయులకు సమాచారం అందించడం ద్వారా వారిని కూడా విద్యాంతులను చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. తద్వారా బాల్య వివాహాలకు కూడా చెక్ పెట్టవచ్చన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఎటువంటి న్యాయ సహాయానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయసేవాధికార కమిటీలు ఉంటాయన్నారు. హెచ్‌ఎం శైలజ, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

స్థానిక లాయరుపేటలోని నారాయణ సీఓ.. ఒలింపియాడ్ స్కూల్‌లో బాలల దినోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ నాగూర్‌వలి మాట్లాడుతూ చాచా నెహ్రూ పుట్టిన రోజును బాలల దినోత్సవంగా నిర్వహించుకుంటామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సంస్కారవంతంగా విద్యను అభ్యసించాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు కనుక ప్రతి ఒక్కరి హృదయంలో విజ్ఞానం అనే విత్తనాన్ని నాటాలని, అవి భవిష్యత్తులో మంచి ఫలాలు ఇవ్వాల్సిన అవసరం ఉందంటూ వివరించారు. ఏజీయం పెద్దిరెడ్డి, ఆర్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

నాగులుప్పలపాడు: నేటి బాలలే రేపటి పౌరులని గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీర్ అహ్మద్ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా ఉప్పుగుండూరు గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. గ్రంథపాలకుడు ప్రసాద్ మాట్లాడుతూ గ్రంతాలయాల వారోత్సవాల సందర్భంగా ఈ నెల 20 లోపు విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మనబ్రోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి నెహ్రూ చిత్ర పటానికి పూలమాలతో నివాళులర్పించారు. సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, కొలకలూరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: చీమకుర్తి, సంతనూతలపాడు గ్రంథాలయాలు, పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సంతనూతలపాడులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, లైబ్రేరియన్, ఎంఈఓ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్లకార్డులను ప్రదర్శించారు.

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీదేవి, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేశారు.గణిత ఉపాధ్యాయుడు సొంత నగదుతో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు పర్రె వెంకట్రావు, పీడీ సాయికిషోర్, శరత్ చంద్ర, నాగమల్లేశ్వరావు, కృష్ణయ్య, మధు, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, శెషగిరి, జిలాని బాష, రజిని, ఉమమహేశ్వరి, పతాంజలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒంగోలు టౌన్: రరాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్.. బిలాల్ నగర్ మదరసా దీనియాలో మంగళవారం నెహ్రూకు నివాళులర్పించారు. అపెక్స్ విద్యాసంస్థల అధినేత కె. శివకోటి రెడ్డి నిర్వాహకులు పాల్గొన్నారు.

ఒంగోలు మెట్రో: స్థానిక ఈమని పాలెం డ్వాక్రా బజారులో మహిళల చిన్నపిల్లల గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. చిత్రలేఖనంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అభ్యాస్ స్కూల్ ప్రిన్సిపాల్ దుర్గా భవాని, టి. గోవిందమ్మ పాల్గొన్నారు.

ఒంగోలు సెంట్రల్: స్థానిక బాగ్యనగర్‌లోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో మంగళవారం నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేదవతి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, చాచాజీ చిన్నారులను ఎంతగానో ప్రేమించి అభిమానించే వారన్నారు. చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది. పరీక్షల్లో, పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు.



నారాయణలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు



బీఎస్‌ఎం జెడ్పీ హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న శ్రీదేవి, ఉపాధ్యాయులు



ఒంగోలు: మహిళల చిన్నపిల్లల గ్రంథాలయంలో నెహ్రూ జయంతి వేడుకలు



ఒంగోలు: మదరసాలో పండ్లు పంపిణీ చేస్తున్న మహబూబ్



చీమకుర్తి: వారోత్సవాల ప్లకార్డులను ప్రదర్శిస్తున్న దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ

ఉపాధి కల్పించడమే లక్ష్యం



ఏపీఓలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మద్దిపాడు: గ్రామాల్లో ప్రజలందరికీ ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే సుధాకర్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని మల్లవరంలో ఉన్న విజయభవన్‌లో నాలుగు మండలాల ఏపీఓలతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నియోజకవర్గంలో అమలు చేస్తున్న తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు సరిపడా పనులు కల్పించడం, యాక్షన్ ప్లాన్ బడ్జెట్ రూపకల్పనలో తీసుకుంటున్న చర్యల గురించి వివరాలు తెలుసుకున్నారు. అందరికీ పనులు కల్పించడమే పథకం ధ్యేయమని.. దీనిని నడిపించడంలో ఏపీఓలదే కీలక పాత్ర అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ వాటా కింద ఎంత నిధులు ఖర్చు చేశారో వివరాలు తెలుసుకుని ఈ పథకం విజయవంతంగా అమలు కావడానికి మేట్లు.. ఫీల్డ్ అసిస్టెంట్లకు వర్క్‌షాప్ నిర్వహించాలని ఉన్నతాధికారులకు సూచించారు.



గుడిపాడులో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం సంతనూతలపాడు మండలంలోని పి.గుడిపాడులో జరిగింది. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రబాబు పాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను పోల్చి వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న శిద్దా సుధీర్ కుమార్



శ్రీవారిని దర్శించుకున్న అనంతరం బంధుమిత్రులతో శిద్దా సుధీర్‌కుమార్

ఒంగోలు: తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు శిద్దా సుధీర్‌కుమార్ మంగళవారం తిరుమలలో బంధుమిత్రులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్నారు.

గ్రామాల్లో అవసరమైన పనులు గుర్తించాలి

మద్దిపాడు: ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాలకు అవసరమైన పనులు గుర్తించడంలో కీలకంగా వ్యవహరిస్తూ గ్రామ నాయకుల సలహాలు తీసుకోవాలని ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ వెంకట స్వామి అన్నారు. మంగళవారం అన్నంగిలో నిర్వహించిన ఉపాధి గ్రామ సభలో మాట్లాడారు. గ్రామాలకు అవసరమైన పనులు గుర్తించడం ఉపాధి కూలీల ద్వారా పనులు చేయించి గ్రామాలకు ఉపయోగపడేలా పనులు చేయించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కీలకంగా వ్యవహరించాలన్నారు. అన్నంగి గ్రామ పరిధిలో పలు పనులు గుర్తించినట్లు తెలిపారు. సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి, రాయపాటి రమేష్, ఏపీఓ ధనంజయ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



పనులను వివరిస్తున్న ఏపీడీ వెంకట స్వామి, సర్పంచ్ లోకేశ్వరి

జీవనశైలి మార్పులతో మధుమేహం దూరం



ప్రసంగిస్తున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు



సర్వ నేత్రాలయంలో రెటినా పరీక్షలు చేస్తున్న డాక్టర్ మానస

ఒంగోలు టౌన్: జీవన శైలిలో గణనీయంగా మార్పులు చేసుకోవడం ద్వారా షుగర్ వ్యాధికి కట్టడి చేయవచ్చని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ అన్నారు. మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని ప్రివెంటివ్ మెడిసిన్ విభాగంలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సరైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం వలన మధుమేహం రాకుండా కాపాడుకోవచ్చన్నారు. తరచూ ఆకలి వేయడం, దాహం ఎక్కువగా ఉండడం, ఎక్కువసార్లు మూత్ర విసర్జనకు వెళ్లాల్సి రావడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడి వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు సూచించారు. ఆర్‌ఎంఓ డాక్టర్ తిరుమలరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డా. భాస్కర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె.రాధిక, వి.ప్రసన్న, ఎం.ప్రదీప్ కుమార్, పి.స్పందన, పి.దివ్య, ఎంపిహెచ్‌ఈఓ బీవీఆర్ ప్రసాద్, తాళ్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సర్వ నేత్రాలయంలో..

ప్రపంచ డయాబెటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంజయ్యరోడ్డులోని సర్వ నేత్రాలయలో మంగళవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్సీని ఉపయోగించి రెటీనా పరీక్షలు నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా రెటినా స్పెషలిస్ట్ డాక్టర్ మానస పెనుమచ్చ మాట్లాడుతూ..షుగర్ వ్యాధిగ్రస్తుల్లో ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే రెటీనా సమస్య కనిపించవచ్చన్నారు. దీనిని డయాబెటిక్ రెటినోపతి అంటారని తెలిపారు. ఈ సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చని, లేకుంటే ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి వస్తుందని వివరించారు. షుగర్ వ్యాధి గ్రస్తులు ప్రతి ఏడాది కంటి పరీక్షలను చేయించుకోవాలిన సూచించారు. ఈ నెల 30వ తేది వరకు ఉచితంగా రెటినా పరీక్షలను చేయనున్నట్లు తెలిపారు. నిర్వాహకులు డా.ఉప్పలపాటి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణ హాస్పిటల్‌లో..

నగరంలోని 60 అడుగుల రోడ్డులో గల కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్ యం. కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 100 మందికి పైగా రోగులకు ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. శుక్లాలు ఉన్నవారికి యం. అంజయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంకితభావంతో పనిచేయండి

ఒంగోలు రూరల్: అధికారులు, సచివాలయ కార్యదర్శులు అంకితభావంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పల్లపోలు మల్లిఖార్జునరెడ్డి కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఒంగోలు మండల సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి కన్వీనర్‌గా వ్యవహరించగా, సచివాలయ భవన నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాలు వెల్‌నెస్ సెంటర్‌ల వివరాలు తెలియజేశారు. డిసెంబర్ ఆఖరుకు భవనాలు పూర్తిచేసి ప్రారంభోత్స కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మత్స్యశాఖ అధికారి తీరప్రాంత గ్రామాల్లో మత్స్యశాఖ అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను గూర్చి వివరించారు. మత్స్యకార గ్రామాలైన గుండాయపాలెం, చింతాయగారిపాలెం, పాతపాడు, పెద్దదేవరంపాడు గ్రామాల్లో మత్స్యకారుల అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి ప్రత్యూష తమ శాఖ ద్వారా పండ్ల తోటల పెంపకం రైతులకు పండ్ల మొక్కలు అందించే కార్యక్రమం సబ్సిడీపై వివరించారు. కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుందర్‌ప్రసాద్ మండలంలో అందిస్తున్న వైద్య సేవలు వివరించారు. ఏపీఎస్‌ఆర్‌టీసీ అధికారి ఆర్‌టీసీలో ప్రవేశపెట్టిన వివిధ పథకాల గూర్చి విద్యార్థులకు అందిస్తున్న పథకాల గూర్చి వివరించారు. ఏపీఎం గోపి నూతన మండల మహిళ ఎంపిక సమాఖ్య, శ్రీనిధి, డ్వాక్రా రుణాల పంపిణీ, ఆసరా కార్యక్రమాల గూర్చి తెలిపారు. మండల విద్యాధికారి కిషోర్‌బాబు.. పాఠ్యపుస్తాకాల పంపిణీ జరిగిందని తెలియజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎలిజిబెత్‌రాణి కరవదిలో అంగన్‌వాడీ సెంటర్ పూర్తికానున్నందన్నారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ భూపాల్ రెడ్డి, హోమియో వైద్యాధికారి, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, పలువురు మండలస్థాయి అధికారులు మాట్లాడారు. కరవది సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్యదర్శులు తమ పనితీరు మార్చుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్షా నలభైవేల ఉద్యోగాలు ఒకేసారి పర్మినెంట్ చే స్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. కానీ కొందరు సచివాలయ సిబ్బంది ఉద్యోగ బద్రత కల్పించడం వలన ధీమా వ్యక్తం చేస్తున్నారని.. రాజకీయాలు మాని పేద, బడుగు వర్గాల అభ్యున్నతకి పాటుపడాలని హెచ్చరించారు. ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఒంగోలు ఎంపీపీ, పక్కన ఎంపీడీవో

ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు



సీతారాంపురం గ్రామ ప్రగతిని వివరిస్తున్న ఏఓ సుబ్బారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి



నాగులుప్పలపాడు: బోర్డు ఆవిష్కరిస్తున్న సర్పంచ్ దాసరి వరప్రసాద్



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

మద్దిపాడు: ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నందునే జగనే ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కావాలని మద్దిపాడు ఎంపీపీ వాకా కోటిరెడ్డి అన్నారు. అవ్వతాతలను కంటికి రెప్పలా చూసుకుంటూ వారికి పెన్షన్లు ఇస్తున్నారని, రైతుల వెన్నంటి ఉంటూ వారి అభ్యున్నతికి పాటు పడుతున్నారని, ఆర్‌బీకేల ద్వారా రైతులకు మేలు కలుగుతోందన్నారు. మంగళవారం సీతారాంపురం కొష్టాల సెంటర్‌లో జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలి అన్న కార్యక్రమంలో ప్రసంగించారు. మీకు మేలు జరిగితేనే ఓటు వేయండన్న దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. సీతారాంపురం గ్రామానికి మొత్తం 14 కోట్ల రూపాయల పైగా వచ్చాయన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ ముఖ్యమంత్రి పనులు చేస్తున్నారన్నారు. పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు పూనాటి చిన్న అప్పారావు, బొమ్మల రామాంజనేయులు, పైనం ప్రభాకర్ గ్రామ మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, దానియేలు, మండవ బాల చంద్రమౌళి, నందిపాడు సర్పంచ్ మద్దినేని అరుణ శ్రీకాంత్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: జగనన్న పాలనల పట్ల రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారు బాబు అన్నారు. జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా మంగళవారం చదలవాడ సచివాలయంలో సర్పంచ్ దాసరి వరప్రసాద్ చేతుల మీదగా సంక్షేమ పథకాల బోర్డుల ప్రదర్శన ప్రారంభించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు మాట్లాడుతూ పథకాల పేరుతో ప్రజలను నిలువునా ముంచిన వ్యక్తి నేడు జైలు జీవితం అనుభవిస్తున్నాడని.. అతని మోసపు మాటలకు కాలం చెల్లిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి పాలన అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి మరలా ముఖ్యమంత్రిని చేసేలా గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు పథకాల వివరాలను తెలియజేసి మరలా జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేలా కృషి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామ కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరించారు. మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ కుమ్మారి సుధాకర్, ఉప సర్పంచ్ కోడె సుబ్బారావు, రామస్వామి, ఈవోఆర్డీ ఏ.వి. కుమారి, సెక్రటరీ స్రవంతి పాల్గొన్నారు.

సంక్షేమ పథకం అందని వ్యక్తి ఉండకూడదు

అల్లూరు (కొత్తపట్నం): సంక్షేమ పథకాలు రాని వ్యక్తి ఉండకూడదని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సీనియర్ వైసీపీ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి అన్నారు. అల్లూరు గ్రామ సచివాలయం-1లో గ్రామ సచివాలయం నోడల్ అధికారి, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అల్లూరు గ్రామ సచివాలయానికి వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా రూ.18.84 కోట్లు అందాయన్నారు. సంక్షేమ పథకాల బోర్డును సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, అధికారులు ఆవిష్కరించారు. కార్యదర్శి ఏ.రామారావు, ఉపసర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గాలి

ఒంగోలు రూరల్: చేజర్లలో వరి సాగు చేసిన 9 మంది రైతులకు ఆత్మా పథకం కింద మంగళవారం పీఎస్పీ అజో స్పైర్లం పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు 500 ఎంఎల్ చొప్పున జిల్లా వనరుల కేంద్రం వారు ఉచితంగా అందించారు. మండల వ్యవసాయశాఖ అధికారి జి.కిశోర్‌బాబు మాట్లాడుతూ జీవన ఎరువులు 200 కిలోలు పశువుల ఎరువులతో కలిపి రైతు పొలంలో వేయించాలని, ఆ రైతులతో ఎలా వేయాలో తెలియజేసి గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రసాయనిక ఎరువులు మోతాదు తగ్గించుకుని వాడుకోవడం వలన ఖర్చు తగ్గుతుందని, పురుగులు, తెగుళ్లు అరికట్టవచ్చని తెలిపారు. అజో స్పైరిల్లం గాలిలో ఉన్న నత్రజనిని స్థిరీకరించి మొక్కలను అందిస్తుందన్నారు. మండల వ్యవసాయ అధికారి జి.కిషోర్‌బాబు, డీఆర్‌సీ వ్యవసాయశాఖ అధికారి వీవీ శేషమ్మ, వీఏఏలు వి.కృష్ణవేణి, అక్సా, రైతులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు సెంట్రల్: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక విష్ణు ప్రియ కన్వెన్షన్‌లో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొంతల కృష్ణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివా రెడ్డి పాల్గొని కార్యకర్తలకు, నూతన బాధ్యులకు దిశా నిర్దేశం చేశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బి.కృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా శాతరాజుపల్లి చంద్రశేఖర్, భగత్ వినోద్ కుమార్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణా రెడ్డి, గంగిరెడ్డి ఆది నారాయణ రెడ్డి, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రవిశంకర్, పీవీ కృష్ణారెడ్డి, తానికొండ సురేష్ యాదవ్ పాల్గొన్నారు.